
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

శనివారం 6 ఏప్రిల్ 2024







సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్



నేడే ప్రజాగళం

- క్రోసూరు, సత్తెనపల్లిలో సభలు
- చంద్రబాబు పర్యటనకు భారీ ఏర్పాట్లు
- నేడు టీడీపీలో చేరనున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

నరసరావుపేట, క్రోసూరు, ఏప్రిల్ 5: ఎన్నికల శంఖారావం పూరించేందుకు శనివారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పల్నాడులో అడుగుపెట్టనున్నారు. పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో జరిగే ప్రజాగళం సభలు, రోడ్‌షోల్లో టీడీపీ అధినేత పాల్గొననున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు చంద్రబాబు పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పసుపు తోరణాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలతో చంద్రబాబు పర్యటన ప్రాంతాలను టీడీపీ నాయకులు అలంకరించారు. క్రోసూరు, సత్తెనపల్లిలో ప్రజాగళం బహిరంగ సభలకు ఏర్పాట్లు చేశారు. క్రోసూరు ఎన్టీఆర్ సెంటర్‌లో జరిగే సభ ఏర్పాట్లను పెదకూరపాడు అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పర్యవేక్షిస్తున్నారు. క్రోసూరులోని పశువుల ఆస్పత్రి వెనుక ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి ప్రధాన రహదారి వరకు చంద్రబాబు ప్రయాణించే వాహనం రావడానికి వీలుగా ప్రత్యేకంగా రోడ్డును నిర్మించారు. క్రోసూరులో సభ అనంతరం ఎర్రబాలెం, పీసపాడు, రెంటపాళ్ల వరకు మోటారు బైక్‌లతో ర్యాలీ ఉంటుందని భాష్యం ప్రవీణ్ తెలిపారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల నుంచి చంద్రబాబుకు ఘనంగా స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. సత్తెనపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో జరిగే ప్రజాగళం సభ ఏర్పాట్లను టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు. ప్రజాగళం విజయవంతంపై విస్తృత ప్రచారం చేశారు. సత్తెనపల్లిలోని 11, 12వ వార్డుల్లో తెలుగు మహిళలు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి మహిళలను ఆహ్వానించారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తన అనుచరులతో కలిసి సత్తెనపల్లిలో జరిగే సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. ఆయన గురజాల నుంచి భారీ ర్యాలీగా సత్తెనపల్లికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయా సభలకు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ అభ్యర్థులు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, యరపతినేని శ్రీనివాసరావు, జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబులతో పాటు కోడెల శివరాం, జనసేన, బీజేపీ, టీడీపీ ముఖ్య నేతలు హాజరు కానున్నారు.



సభకు రావాలని మహిళలకు బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న తెలుగు మహిళలు

ప్రజాగళం షెడ్యూల్..

చంద్రబాబు శుక్రవారం మధ్యాహ్నం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి హెలికాప్టర్‌లో 2.55 గంటలకు క్రోసూరుకు చేరుకుంటారు. పశువుల ఆస్పత్రి సెంటర్‌లోని హెలిప్యాడ్ నుంచి 3.10 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. సభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. 5.15 గంటలకు వేదిక నుంచి కారులో సత్తెనపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌కు 6 గంటలకు చేరుకుంటారు. అక్కడ సభలో ప్రసంగిస్తారు. అనంతరం రాత్రి బస కోసం వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో నియోజకవర్గాల వారీగా ఎన్నికల తీరుపై చంద్రబాబు సమీక్షించనున్నారు.

ఫైర్..డే

- భానుడి భగభగ
- 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- సాధారణం కన్నా 10 డిగ్రీలు అధికం
- ఉమ్మడి జిల్లా అంతటా సూర్య ప్రతాపం

ఉష్ణోగ్రత డిగ్రీలలో..

రెంటచింతల	45
మాచర్ల	45
వినుకొండ	45
గురజాల	45
దాచేపల్లి	45
నరసరావుపేట	44
పిడుగురాళ్ళ	44
వినుకొండ	43
సత్తెనపల్లి	43
చిలకలూరిపేట	43



నిర్మానుష్యంగా నరసరావుపేటలోని పల్నాడు రోడ్డు

నరసరావుపేట, రెంటచింతల, ఏప్రిల్ 5: భానుడు భగభగలతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ నెల ఆరంభంలోనే 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మే నెలను తలపించే రీతిలో ఎండలు ఉన్నాయి. 9 గంటల నుంచి వేడి తీవ్రత కనిపిస్తోంది. రానున్న వారం రోజులు ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇప్పుడే ఎండ తీవ్రత ఈ స్థాయిలో ఉంటే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయాందోళనల్లో ప్రజలున్నారు. ఎండ వేడిమి, ఉక్కపోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చే సాహసం చేయడంలేదు. అత్యవసర పనులకు మాత్రమే బయటకు వస్తున్నారు. గత ఏడాది ఇదే రోజున 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణం కన్నా 10 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. రెంటచింతల, నరసరావుపేట ప్రాంతాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఎండకు పేరుగాంచిన రెంటచింతలలో శుక్రవారం అత్యధిక పగటి ఉష్ణోగ్రత 43.5 డిగ్రీలుగా నమోదైనట్లు జంగమహేశ్వరపురం వాతావరణ కేంద్రం పీటీవో భానుప్రసాద్ చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇదే ఎక్కువన్నారు. గాలిలో తేమ శాతం తగ్గిపోవడంతో ఎండ తీవ్రత ఎక్కువైంది. నిత్యం వందల మందితో కోలాహలంగా కనిపించే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రధాన రహదారులు ఉదయం పదిగంటలకే నిర్మానుష్యంగా మారాయి.

జాగ్రత్తలు అవసరం..

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఎండలో బయటకు వెళ్లే వారు రక్షణగా గొడుగు వాడితే మంచిదంటున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రాకూడదని హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే ముక్కు, చెవులకు వస్త్రం చుట్టుకోవడం మంచిది. చిన్నారులు, వృద్ధులు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, క్షేత్రస్థాయిలో పనిచేసే వారు తగిన జాగ్రత్త పాటించాలని చెబుతున్నారు. నీటిని ఎక్కువగా తాగాలని, మజ్జిగ కొబ్బరి నీళ్లు పండ్ల రసాలు తీసు కోవాలని సూచిస్తున్నారు. ద్విచక్రవాహనంపై ఎక్కువ దూరం ప్రయాణించడం అంత మంచిది కాదని హెచ్చరిస్తున్నారు.



నిర్మానుష్యంగా రెంటచింతల ప్రధాన రహదారి

ఉపాధ్యాయ సంఘాల..

నేతలకు ఎర!



- ఓట్ల కోసం అధికార పార్టీ ఉపాధ్యాయులకు ఆత్మీయ గాలం
- ఆత్మీయ సమావేశాల పేరుతో భారీ నజరానాలు
- పల్నాడులో ఓ సంఘానికి 10 సెంట్ల స్థలం కేటాయింపు
- భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, జిల్లా అత్యున్నత అధికారి
- గుంటూరు జిల్లాలో ఓ ఎమ్మెల్యే రూ. 5లక్షలు నిధులు
- సంఘం ముసుగులో ఎన్నికల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితా సేకరణ
- ఉపాధ్యాయుల సమాచారం అధికార పార్టీ గుప్పిట్లోకి..

గుంటూరు(విద్య), ఏప్రిల్5: ఇప్పటి వరకు ఉపాధ్యాయుల్ని పూచిక పుల్లతో సమానంగా చూసిన అధికార పార్టీ నేతలు ఓట్ల కోసం కొత్త నాటకం ప్రారంభించారు. రహస్యంగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తూ నజరానాలు, నోట్లతో ఎరవేస్తున్నారు. సంఘాలకు చెందిన ప్రధాన నాయకులకు ఇప్పటికే భారీమొత్తంలో ముట్టచెప్పినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రోజు ఏదో ఒక చోట ఉపాధ్యాయులు, సంఘాల నేతలతో ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు ఆత్మీయ సమావేశాలు పెడుతున్నారు. మరోవైపు ఎన్నికల ముందే రహస్యంగా ఓ సంఘానికి 10 సెంట్ల స్థలం కేటాయించడం దీని భూమి పూజ కోసం జిల్లా అత్యున్నత అధికారి, ఎమ్మెల్యే రావడం, ఆ సంఘం ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితాను అధికారపార్టీ నేతల చేతుల్లో పెట్టడం వంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో కలకలం సృష్టిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో దాదాపు ప్రభుత్వ, జడ్పీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు 16వేల మందికిపైగా ఉన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో ఉపాధ్యాయులకు ప్రభుత్వం చేసింది ఏమీ లేకపోగా యాప్‌ల పేరుతో నిత్యం వేధింపులకు గురిచేసింది. ఇప్పటికే సంఘాల నాయకులపై అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికితోడు ముఖ్య కార్యదర్శి హోదాలో పాఠశాలల్లో ప్రవీణ్‌ప్రకాశ్ చేసిన హడావిడి, ఉపాధ్యాయులతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన తీరు తెలిసిందే. దీంతో ఉపాధ్యాయుల్లో దాదాపు 90శాతంపైగా ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈనేపథ్యంలో వారిని మంచి చేసుకునేందుకు పార్టీ నాయకులు రంగంలోకి దిగారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో సంఘాలకు చెందిన ప్రధాన నాయకులను ఎమ్మెల్యేలు కలవకుండా ద్వితీయ శ్రేణి నేతలతో రహస్యంగా ఫోన్‌లోనే టచ్‌లోకి వస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న కోపం స్థానికంగా మామీద చూపవద్దని ఈసారి తమకే ఓట్లు వేయాలని ఎమ్మెల్యేల చేత సంఘాల నాయకులకు ఫోన్ చేయిస్తున్నారు. జిల్లాలో ఓ సంఘానికి ఓ ఎమ్మెల్యే అభ్యర్థి రూ. 5లక్షల వరకు నిధులు సమకూర్చారు. ఈ సంఘానికి చెందిన రాష్ట్రస్థాయి మాజీ నేతకు ఈ మొత్తం అందినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో గతంలో ప్రభుత్వంపై బహిరంగానే విరుచుకుపడే ఈ నేత ఇప్పుడు పెద్దగా స్పందించడం లేదు. ఈ సంఘం నాయకులు ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో టచ్‌లో ఉంటూ లక్షల్లో సంఘానికి నిధులు సమకూర్చేపనిలో ఉన్నారు. పల్నాడు జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ జారీకి ముందు ప్రభుత్వానికి చెందిన రూ.లక్షల విలువైన 10సెంట్ల స్థలాన్ని ఎటువంటి ఉత్తర్వులు లేకుండా ఓ సంఘానికి కట్టబెట్టారు. పల్నాడులో విద్యాశాఖకు చెందిన ఉన్నత అధికారి ఒకరు ఎన్నికల సెల్ పేరుతో కార్యాలయంలో అనధికారికంగా ఓ విభాగం ప్రారంభించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితాలు ఎప్పటికప్పుడు పార్టీ నాయకులకు చేరవేసే పనిలో ఆయన నిమగ్నమై ఉన్నట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితాను కొన్ని సంఘాలు రహస్యంగా సేకరించినట్లు సమాచారం. దీనిని అధికారి పార్టీ నేతలకు చేరవేసి భారీ స్థాయిలో లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. బాపట్ల జిల్లాలో సైతం ఓ రెండు సంఘాలు అనధికారికంగా అధికార పార్టీ సేవలో తరిస్తున్నాయి.

గుంటూరు బరిలోకి.. మూడో కృష్ణుడు?



- లోక్‌సభ స్థానంలో పోటీకి వైసీపీ నేతలు వెనుకంజ
- కిలారి పోటీ చేయననడంతో అధిష్ఠానం పునరాలోచన
- పరిశీలనలో ఆళ్ల, మోదుగుల, కదిరి బాబురావుల పేర్లు
- టీడీపీ అభ్యర్థి పెమ్మసాని దూకుడుతో వైసీపీలో దడ
- ఎమ్మెల్యే రోశయ్యకు తిరిగి పొన్నూరే దక్కే అవకాశం

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ స్థానం బరిలో దిగేందుకు వైసీపీ నేతలు వెనుకంజ వేస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఎన్ఆర్ఐ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దూకుడుతో వైసీపీ అభ్యర్థులు వణికి పోయి పరారవుతున్నారు. ఇప్పటికే ఉమ్మారెడ్డి వెంకటరమణ తన వల్ల కాదని చెప్పేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో రంగప్రవేశం చేసిన పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య కూడా బావ బాటే పట్టారు. దీంతో అయోమయానికి గురైన వైసీపీ అధిష్ఠానం అయోమయంలో పడి మూడో కృష్ణుడి కోసం అన్వేషణ మొదలుపెట్టినట్లు సమాచారం. గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో సైతం గుంటూరు లోక్‌సభ స్థానాన్ని టీడీపీ దక్కించుకుంది. ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలు గెలుపొందినా కూడా ఆ పార్టీ తరఫున బరిలోకి దిగిన మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పరాజయం పాలయ్యారు. దీంతో ఈ ఎన్నికల్లో మొదట్లో ఆయన పేరు పరిగణనలోకి తీసుకోలేదు. కాపు సామాజికవర్గం అభ్యర్థిని బరిలోకి దించాలనే ఆలోచనతో తొలుత కేంద్ర మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తనయుడు వెంకటరమణను బరిలోకి దింపారు. ఇక్కడ పోటీ చేసి గెలవడం సాధ్యం కాదని భావించిన ఆయన వారం రోజుల్లోనే చెప్పా పెట్టకుండా హైదరాబాద్ వెళ్ళిపోయారు. ఈ పరిణామంతో అవాక్కైన వైసీపీ అధిష్ఠానం ఆయన బావ, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యను బలవంతంగా బరిలోకి దించింది. అయితే ఇంతవరకు ఆయన గుంటూరులో కార్యాలయాలన్ని ఏర్పాటు చేసుకోలేదు. మొక్కు బడిగా పొన్నూరు, గుంటూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థులతో ప్రచారంలో పాల్గొంటూ వచ్చారు. మరో వైపు టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని లోక్ సభ స్థానం పరిధిలో రెండో పర్యాయం కూడా పర్యటన ప్రారం భించారు. తొలి సారి ఎన్నికల బరిలోకి దిగినప్పటికీ వ్యూహాత్మకంగా అడు గులు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థులుగా బరిలోకి దిగుతున్న వారు ఓటమి భయంతో ఒక్కొక్కరుగా తప్పుకుంటు న్నారు. రెండు రోజుల క్రి త ం ప్రభుత్వ సలహాదారు సజ్జలను కలిసి తాను ఎంపీగా పోటీ చేయనని రోశయ్య చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆయన గుంటూరు పశ్చిమ, లేదా పొన్నూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరగా పశ్చిమ నుంచి ఎట్టి పరిస్థితుల్లో అవకాశం కల్పించలేమని సజ్జల చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే ముమ్మరంగా ప్రచారం చేస్తున్న మంత్రి విడదల రజినిని కదిలించే అవకాశం లేదని చెప్పారు. దీంతో ఇక పొన్నూరే ఆయనకు దక్కే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం బరిలో ఉన్న అంబటి మురళీ కూడా రోశయ్య సామాజికవర్గమే కావడంతో అధిష్ఠానానికి కొత్త సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితి నెలకొంది. ఉగాది తర్వాత జరిగే మార్పుల్లో రోశయ్య పేరు కూడా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈలోగా గుంటూరు ఎంపీ అభ్యర్థిగా మూడో కృష్ణుడ్ని బరిలోకి దించేందుకు పలు పేర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. రెడ్డి సామాజికవర్గానికి ఇచ్చే పక్షంలో మంగళగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిల పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మోదుగులను అసెంబ్లీ బరిలోకి దించాలని ఆలోచన చేసిన అధిష్ఠానానికి వీలు కాలేదు. దీంతో ఆయన పేరును తాజాగా ఎంపీ అభ్యర్థిగా పరిశీలిస్తున్నారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డికి మోదుగుల, రామకృష్ణారెడ్డిలు బంధువులు కావడంతో వీరిలో ఒకరికి అవకాశం కల్పించాలని అధిష్ఠానం యోచన చేస్తున్నట్లు సమాచారం. కాపు సామాజికవర్గానికే సీటు ఇవ్వాలనుకునే పక్షంలో ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

పోరాటాల పురిటిగడ్డ

- రాజకీయ పోరాటాలకు వేదిక సత్తెనపల్లి
- ఎందరో కళాకారులకు నిలయం
- ఇక్కడ ఎవరు గెలిస్తే.. ఆ పార్టీదే రాష్ట్రంలో అధికారం

మొత్తం ఓటర్లు :	2,39,077
పురుషులు:	1,17,108
స్త్రీలు :	1,21,955
ఇతరులు :	14

సత్తెనపల్లి ప్రాంతంలో రాజకీయ పోరాటాలు సాగాయి. స్వాతంత్ర్య పోరాటంలో ఇక్కడి నుంచి యోధులు పాల్గొన్నారు. సంస్కరణోద్యమ కారులున్నారు. సినీ నాటకరంగానికి చెందిన ప్రముఖులు ఉన్నారు. ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే నానుడి ఉంది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇది నిజమవుతూనే వచ్చింది. ఇక్కడ గెలిచిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అంబటి రాంబాబు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

నియోజక వర్గంలో సామాజిక వర్గాల ఓట్లు

- కమ్మ - 32,316
- రెడ్డి- 18,857
- ముస్లిం- 28,720
- మాదిగ -27,543
- కాపు- 19,795
- యాదవ - 15,893
- మాల -13,266
- వడ్డెర - 9,602
- వైశ్య -7,659
- రజక -7,780
- ఎరుకల- 4,534
- ముదిరాజులు - 2,473
- కుమ్మరి - 4,002
- సుగాలీ - 2,787
- పద్మసాలీ - 3,305
- నాయీ బ్రాహ్మణ - 2,220
- యానాది - 4,588
- దూదేకుల - 1,572
- బ్రాహ్మణ - 1,528
- జంగాలు - 1,030
- తొగటి-834
- ఆది ద్రావిడ - 811
- మేదర -800
- బోయ - 758
- విశ్వ బ్రాహ్మణ -762
- రాజులు - 568
- దాసుల్లు - 450
- గౌడ -442
- అరవ -593
- ఇతరులు - 2,409

సత్తెనపల్లి ఏప్రిల్ 5: సత్తెనపల్లి నియోజకవర్గంలో తెలంగాణా సాయుధ పోరాటాలు, ప్రజా ఉద్యమాలు జరిగాయి. నాగార్జున సాగర్‌ను నిర్మించాలని రైతులు ఉద్యమాలు నడిపారు. నాగార్జున సాగర్ నీరు వినియోగంలోకి రాకముందు సత్తెనపల్లి మెట్ట ప్రాంతం. అపరాలు, జొన్న, మిర్చి, శనగపంట సాగు చేసేవారు. నీటి వసతి ఏర్పడిన తరువాత వరి, పత్తి, మిర్చి, పసుపు, అపరాలు వంటి వాణిజ్య పంటలు విస్తారంగా పండిస్తున్నారు. సత్తెనపల్లి ప్రాంతంలో రాజకీయ పోరాటాలు సాగాయి. స్వాతంత్ర్య పోరాటంలో ఇక్కడి నుంచి యోధులు పాల్గొన్నారు. సంస్కరణోద్యమ కారులున్నారు. సినీ నాటకరంగానికి చెందిన ప్రముఖులు ఉన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముప్పాళ్ళ గ్రామంలో జన్మించిన భవనం వెంకట్రామ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవి నిర్వహించారు. వావిలాల గోపాల కృష్ణయ్య, ఆమంచి నరసింహారావు వంటి ప్రముఖులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. వావిలాల గోపాల కృష్ణయ్య సత్తెనపల్లికి నాలుగుసార్లు శాసన సభ్యునిగా ఎన్నియ్యారు. ఆయన మరణానంతరం ఆయన మృతికి గుర్తుగా పట్టణంలోని 3వవార్డులో వావిలాల ఘాట్‌ను, పార్కును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలుగా పనిచేసిన పుతుంబాక వెంకటపతి, పుతుంబాక భారతీలు రైతులకు పేద ప్రజలకు అండగా నిలిచారు. రాజకీయ సాంస్కృతిక కళారంగాల్లో సత్తెనపల్లి ప్రాంతం మంచి పేరొందింది. 1952లో నియోజకవర్గం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 2024లో 16వసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుం దనే నానుడి ఉంది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇది నిజమవుతూనే వచ్చింది. ఇక్కడ గెలిచిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అంబటి రాంబాబు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. పుతుంబాక వెంటపతి, భారతిలు ఇద్దరు భార్యాభర్తలు ఇరువురిని నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేలుగా గెలిపించు కున్నారు. నియోజకవర్గంలో సత్తనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలతోపాటు సత్తెనపల్లి మండల ఓటర్లు ఉన్నారు. వావిలాల గోపాల కృష్ణయ్య కమ్యూనిస్టు పార్టీ తరుపున ఒకసారి, స్వతంత్ర్య అభ్యర్థిగా మూడుసార్లు విజయం సాధించారు. సత్తెనపల్లి శాసన సభ్యునిగా యర్రం వెంకటేశ్వరెడ్డి 2004, 2009 ఎన్నికల్లో విజయం సాధించారు. వావిలాల గోపాల కృష్ణయ్య 1952, 62, 67లో స్వతంత్ర అభ్యర్థిగా, 55లో కమ్యూనిస్టు పార్టీ తరఫున గెలుపొందారు. 1972లో గాదె వీరాంజనేయ శర్మ (కాంగ్రెస్), 1978 లో డాక్టర్ రావెల వెంకటరావు (కాంగ్రెస్), 1983లో నన్నపనేని రాజకు మారి (టీడీపీ) , 1985లో పుతుంబాక వెంకట పతి (సీపీఎం) 1989లో దొడ్డా బాలకోటిరెడ్డి (కాంగ్రెస్), 1994 లో పుతుంబాక భారతి (సీపీఎం), 1999లో వైవీ ఆంజ నేయులు (టీడీపీ), 2004, 2009లో యర్రం వెంకటేశ్వ రరెడ్డి (కాంగ్రెస్), 2014లో డాక్టర్ కోడెల శివప్రసాదరావు (టీడీపీ) 2019లో అంబటి రాంబాబు (వైసీపీ) లు విజయం సాధించారు.

ప్రస్తుత ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా కన్నా లక్ష్మీ నారాయణ, వైసీపీ అభ్యర్థిగా అంబటి రాం బాబులు పోటీ పడుతుండడం ప్రత్యేకం. ఇరువురూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల తరపున విడి విడిగా అభ్యర్థులు పోటీ చేశారు. ఈసారి మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా కన్నా లక్ష్మీనారాయణ పోటీలో ఉన్నారు. పోటీ రసవత్తరంగా జరగనుంది.



వైసీపీకి సేవ చేస్తే.. భూమిని కాజేశారు

- తోటి వైసీపీ నేతలే బినామీ పేర్లతో ఆక్రమించారు
- ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని ఆశ్రయించినా న్యాయం జరగలేదు
- నడికూడి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పెద పిచ్చయ్య

6లో..

8న సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(శనివారం)

సహారీ (ఉదయం) 4.42 (ఆదివారం)


తుళ్లూరులో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతి అభివృద్ధిని కాంక్షించేవారిని గెలిపించాలి

- విచ్ఛిన్నం చేసే వారిని ఇంటికి పంపాలి
- 1571వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్ 5: అమరావతి అభివృద్ధిని కాంక్షించేవారిని గెలిపించి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1571వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు, గృహాల నుంచి నిరసన దీక్షలు చేస్తున్న మహిళలు, రైతులు మాట్లాడుతూ, అమరావతి విచ్ఛిన్నం చేయాలనుకున్న వారిని ఇంటికి పంపాలని విజ్ఞప్తి చేశారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం అమరావతి అభివృద్ధి చెందితే యువతకు బంగారు భవిషత్ ఉండేదన్నారు. మూడు రాజధానలంటూ అమరావతిని నిర్వీర్యం చేసిన వైసీపీ పాలకులను శాశ్వతంగా ఇంటికి పరిమితం చేయాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నేడు టీడీపీలోకి ఎమ్మెల్సీ జంగా

- వున్నంతో పాటు మరికొందరు


జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 5: వైసీపీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరనున్నారు. శనివారం సత్తెనపల్లిలో జరగనున్న ప్రజాగళం సభలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి సమక్షంలో ఆయన పసుపు కండువా కప్పుకోనున్నారు. జంగా కృష్ణమూర్తితో పాటు పిడుగురాళ్లకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ వున్నం నరసింహారావు, ఆయన తనయుడు డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, దాచేపల్లి మాజీ ఎంపీపీ భూషణం చెన్నయ్య, మాశెట్టి పుల్లారావుతో పాటు మరికొందరు నేతలు కూడా నేడు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. బీసీల్లో మంచి పట్టున్న జంగా కృష్ణమూర్తి తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు కోస్తా జిల్లాల్లోనూ ఆ ప్రభావం పడే అవకాశం వుంది. 1999 నుంచి 2019 వరకు చిరకాల ప్రత్యర్థులుగా వున్న గురజాల మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఎట్టకేలకు ఒకేతాటిపైకి రావడం ఇక్కడ హాట్ టాపిక్‌గా మారింది. 2024 ఎన్నికల్లో ఇరువురు తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం పాటుపడేందుకు ఒకే వేదికపైకి వచ్చారు. జంగా కొద్దిరోజుల క్రితమే టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

- కన్నా లక్ష్మీనారాయణ


నకరికల్లులో టీడీపీలో చేరిన వారితో కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

నకరికల్లు, ఏప్రిల్ 5: గోదావరి-పెన్నా నదుల అనుసంధానం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటం, ఆంధ్రప్రదేశ్ రాజధానిని నిర్మించటం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి నకరికల్లు టీడీపీ కార్యాలయంలో నకరికల్లుకు చెందిన ఎస్సీ ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన వైసీపీలోని 225 కుటుంబాలు టీడీపీలో చేరారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పిఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ప్రజలంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించటానికి సంసిద్ధంగా ఉన్నారన్నారు. రాజధాని నిర్మాణం చేసి ఇక్కడే సంపదను సృష్టించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, పార్టీ పరిశీలకులు ముక్కపాటి రామచంద్రరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు బత్తిన శ్రీనివాసరావు, బీజేపీ నేతలు షేక్ మున్వర్‌బాజీ, పాలడుగు శ్రీనివాసరావు, తిరుమలశెట్టి వెంకటరావు, ఢీకొండ మహానంది, కాసా సాంబయ్య, భవనాసి కిషోర్, దూదేకుల హుస్సేన్‌బీ, అట్లూరి పుల్లమ్మ పాల్గొన్నారు.

తాడిశెట్టి చేరికతో టీడీపీ మరింత బలోపేతం

- గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్
- టీడీపీ గెలుపునకు అహర్నిశలు పని చేస్తాం :తాడిశెట్టి మురళి
- పెమ్మసాని సారధ్యంలో భారీగా ర్యాలీతో తరలివెళ్లిన మురళి, ఆయన అనుచర గణం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5: తాడిశెట్టి సోదరుల చేరికతో జిల్లాలో టీడీపీ మరింత బలోపేతమైందని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నగర మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి, అమల దంపతులు వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్న సందర్భంగా స్థానిక ఆర్టీవో కార్యాలయం, శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన అభిమానుల ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాడిశెట్టి మురళి మోహన్ టీడీపీలోకి రావడం శుభసూచకమన్నారు. మురళి రాకతో జిల్లాలో కూటమి గెలుపు తేలికైందన్నారు. శక్తివంతమైన తాడిశెట్టి సోదరులకు టీడీపీలో కీలకమైన బాధ్యతలను త్వరలోనే అప్పజెప్తామని హామీ ఇచ్చారు.

వైసీపీ ఓటమే లక్ష్యంగా పనిచేస్తాం: తాడిశెట్టి మురళి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను తీవ్రంగా మోసంచేసిన వైసీపీ ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని తాడిశెట్టి మురళి స్పష్టం చేశారు. టీడీపీలోకి చేరే ముందు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి నేతి బీరకాయ చందంగా మారిందని విమర్శించారు. ఐదేళ్లలో అన్ని రంగాలను జగన్ నాశనం చేసారని విమర్శించారు. ముఖ్యంగా బీ సీలకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో వైసీపీలో కొనసాగానని, అక్కడ అటువంటి పరిస్థితులు లేవనే అందుకే ఆ పార్టీని వీడుతున్నట్టు వివరించారు. అమరావతి అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో ఒక్క పార్లమెంట్, ఏడు నియోజకవర్గాలను కూటమి క్లీన్ స్వీప్ చేయబోతున్నట్టు ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతున్నట్టు స్పష్టం చేశారు.

పెమ్మసాని సారధ్యంలో భారీగా ర్యాలీతో తరలివెళ్లిన తాడిశెట్టి మురళి

అంతకుముందు నగరంలో తాడిశెట్టి అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టాభిపురంలోని తాడిశెట్టి మురళి నివాసం నుంచి ఆర్టీవో కార్యాలయం, శిల్పారామం వరకు భారీవాహనాలతో వేలాదిమంది కార్యకర్తలతో ర్యాలీ జరిగింది. అనంతరం ఉండవల్లి, చంద్రబాబు నాయుడు ఇంటివరకు ఏర్పాటుచేసిన ర్యాలీని పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. వేలాదిమంది కార్యకర్తలతో తాడిశెట్టి మురళి, దంపతులు తరలివెళ్లారు. తాడిశెట్టి మురళితో పాటు గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర. తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు అభ్యర్థులు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, టీడీపీ నేతలు రావిపాటి సాయి, చిట్టాబత్తిని చిట్టిబాబు, తాడిశెట్టి మిత్రులు సోమేపల్లి శివప్రసాద్, వక్కలగడ్డ రామకృష్ణ తదితరులు ఉన్నారు.


లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాడిశెట్టి మురళి, అమల దంపతులు, పక్కన పెమ్మసాని

యువనేత లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన వారు వీరే....

తాడిశెట్టి కుటుంబీకులతో పాటు టీడీపీలో చేరినవారిలో కార్పొరేటర్ మల్లిబోయిన శ్రీవల్లి (52వ డివిజన్) మాజీ జడ్పీటీసీ భూపతి శ్రీనివాసరావు, జయరామ్ నాయుడు, మాజీ కార్పొరేటర్లు అడపా కాశీవిశ్వనాథం, సంబరాల వాసు, వంజరపు రత్నకుమారి, రేఖా ఉమామహేశ్వరి, ఇంకొల్లు శంకర్ రావు, రెడ్డిపాలెం సర్పంచ్ బుజ్జి (రెడ్డిపాలెం), మాజీ సర్పంచ్‌లు యర్రంశెట్టి వేణుగోపాల్, చింతా సుబ్బారావు, ఎలిమినేటి వెంకటేశ్వర్లు, మోడావత్ శ్రీనునాయక్, మాజీ ఎంపీటీసీలు మల్లెంపాటి శేషగిరిరావు, వేల్పూరి వెంకటస్వామి, వైసీపీ రాష్ట్ర నాయకులు చంగలశెట్టి సత్యనారాయణ, చింతల దేవి, సుబ్బారావు (రెడ్డిపాలెం), బీసీ నాయకులు, విన్నకోట శంకర్, విన్నకోట మధు, కొండెబోయిన శ్రీనివాసరావు, ఎస్టీ నాయకుడు పరసా కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు డైరక్టర్ తాళ్ల నాగరాజు, ప్రముఖ నాయకులు ఈదర సాయిప్రసాద్ చౌదరి, ఐలా శ్రీనివాసరావు (పాతగుంటూరు), మంగళగిరి చేనేత నాయకులు కానుగుల రవి, కాపు నాయకుడు నామాల శశిధర్, ఆర్యవైశ్య ప్రముఖులు వెచ్చా కృష్ణమూర్తి, నగర నాయకులు రెడ్డి వీరస్వామి తదితరులు ఉన్నారు.

వైసీపీకి సేవ చేస్తే.. భూమిని కాజేశారు

- తోటి వైసీపీ నేతలే బినామీ పేర్లతో ఆక్రమించారు
- ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని ఆశ్రయించినా న్యాయం జరగలేదు
- నడికూడి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ పెద పిచ్చయ్య


పెద పిచ్చయ్య

గురజాలటౌన్, ఏప్రిల్ 5: వైసీపీ కోసం కష్టపడి పనిచేస్తే ఆ పార్టీవారే తన భూమిని కాజేశారని నడికుడి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తగుళ్ల పెద పిచ్చయ్య ఆరోపించారు. శుక్రవారం మండలంలోని తేలుకుట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో తనకున్న 4.40 ఎకరాల్లో 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నామన్నారు. పట్టాలు కోసం గురజాల తహసీల్దార్ వద్దకు వెళ్తే పొలం నీ పేరు మీద లేదని చెప్పారన్నారు. తన పొలం తోటి వైసీపీ నేతలే బినామీ పేర్లపై ఆన్‌లైన్‌లో మార్చుకున్నారని తెలుసుకొని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వద్దకు వెళ్లి తమ పొలం పట్టాలు ఇప్పించాలని కోరామన్నారు. అయితే తనకు న్యాయం జరుగలేదని, అందుకే తన పదవికి, పార్టీకి రాజీనామా చేశానన్నారు. ఇది సహించలేని కొందరు వ్యక్తులు తనను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని దక్కించుకోవడానికి చివరికి ఆర్డీవో కార్యాలయంలో రూ. 20 వేలు, తహసీల్దార్ కార్యాలయంలో రూ. 20 వేలను అక్కడి అధికారులకు ఇచ్చానన్నారు. అయినా ఫలితం రాలేదన్నారు. ఇక ఉన్నతాధికారులను ఆశ్రయించడమే నయం అని ఫిర్యాదు చేయనున్నట్లు పెదపిచ్చయ్య చెప్పారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

- కనుమరుగవుతున్న పంట కాల్వల గట్లు
- ఎన్నికల విధుల్లో అధికారులు
- చెలరేగిపోతున్న అక్రమార్కులు


చింతలపూడి పంటపొలాల్లో పంట కాల్వ మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్


ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తున్న దృశ్యం

పొన్నూరుటౌన్, ఏప్రిల్5: పొన్నూరు మండలంలో అక్రమ మట్టి తవ్వకందారులు అధికారపార్టీ అండతో చెలరేగిపోతున్నారు. మండల అధికారులు, ఎన్నికల విధుల్లో ఉండటంతో అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండలంలోని చింతలపూడి గ్రామంలో కొతివానిపాలెం గ్రామ రహదారిలో పంట కాల్వల గట్లను అనుమతులు లేకుండా తవి తరలించుకుపోయి విక్రయించుకుంటున్నారు. అలాగే వడ్డిముక్కల గ్రామంలో నాలుగైదు రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా మట్టి రవాణా సాగుతోంది. పంట పొలాల్లో మెరకవేసిన మట్టి తొలగిస్తున్నామని చెప్పి పంట కాల్వ గట్లను తవ్వుకొని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు కూడా ఎన్నికల విధులతోపాటు గ్రామాలో మట్టితవ్వకందారులపై నిఘా వేయాలన్ని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మాజీ జడ్పీటీసీ ఉప్పుటూరి సీతామహాలక్ష్మి కన్నుమూత



భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న రామాంజనేయులు, ఇన్‌సెట్లో సీతామహాలక్ష్మి

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 5: వట్టిచెరుకూరు మండల మాజీ జడ్పీటీసీ ఉప్పుటూరి సీతామహాలక్ష్మి(64) అనారోగ్యంతో గత కొంతకాలంగా చికిత్స పొందుతూ శుక్రవారం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆమె మరణంతో మండలంలోని ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె భౌతికకాయాన్ని పుల్లడిగుంటలోని స్వగృహానికి తీసుకొచ్చారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సీతామహాలక్ష్మి 2014లో టీడీపీ తరపు న వట్టిచెరుకూరు మండల జడ్పీటీసీగా గెలుపొందారు. గ్రామంలో ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ తన వద్దకు ఎలాంటి సహాయం కోసం వచ్చినా లేదనకుండా, తన వంతు సహకారాన్ని అందిస్తూ చెరగని ముద్ర వేసుకున్నారు. అందుకే ఆమెను అంతా అమ్మ అని ఆప్యాయంగా పిలుస్తారు. తన కుమారుడు ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి ప్రోత్సాహం, తోటి ఎన్ఆర్ఐల సహకారంతో ప్రభుత్వ ప్రైవేటు స్కూల్స్ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప్పుటూరి చినరాములు సేవాట్రస్ట్ పేరుతో వాటర్‌కూలర్లు అందించారు. ఏటా రైతులకు విత్తనాలు, యంత్ర పరికరాలు అందజేస్తున్నారు. పది పరీక్షల సమయంలో మండలంలోని స్కూళ్లలో పరీక్ష సామాగ్రితో పాటు మజ్జిగప్యాకెట్లు అందించారు. వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లోని పలు స్కూళ్లలో చిన్నారులకు బ్యాగ్‌లు, నోట్‌పుస్తకాలు అందించి తమ ఉదారతను చాటుకు న్నారు. సీతామహలక్ష్మి మరణవార్త తెలిసిన వెంటనే ప్రత్తిపాడు నియో జకవర్గ టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, జనసేన ప్రత్తిపాడు నియోజ కవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వ రరావు, పలువురు నాయకులు శుక్రవారం పుల్లడిగుంటలోని ఆమె స్వగృహానికి చేరుకొని ఆమె భౌతికకాయా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె భర్త చిన రాము లు, కుమారుడు, ఎన్ఆర్ఐ రామ్‌చౌదరి, ఇతర కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. సీతామహాలక్ష్మి భౌతికకాయానికి శనివారం ఉదయం 11 గంటల ప్రాం తంలో స్థానిక శ్మశానవాటి కలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు వెల్లడించారు.

8న సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

విజయపురిసౌత్, ఏప్రిల్ 5: వేసవి దృష్ట్యా ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం ఈనెల 8వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నాగార్జున సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వం ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ కుడి కాలువ ద్వారా 5500 క్యూసెక్కుల చొప్పున ఈ నెల 18వ తేదీ వరకు నీటిని విడుదల చేయాలని ఉత్తర్వులిచ్చారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని అధికారులు తమ పరిధిలోని 461 సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నీటితో నింపుకోవాలని ఉత్తర్వుల్లో తెలిపారు.

హైవేపై అదుపుతప్పిన మినీ బస్సు

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 5: స్పైసెస్ పార్కుకు ఉద్యోగులతో వెళుతున్న మినీ బస్సు అదుపు తప్పిన ఘటన మండలంలోని తుమ్మలపాలెం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నుంచి యడ్లపాడు వద్ద స్పైసెస్ పార్కుకు మినీ బస్సు 12మంది ఉద్యోగులతో వెళుతోంది. అయితే డ్రైవర్ వేగంగా బస్సు నడపటంతో తుమ్మలపాలెం వద్ద బస్సు అదుపుతప్పింది. దీంతో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఐరన్ ఫెన్సింగ్‌ను బస్సు గుద్దుకుంటూ సర్వీసు రోడ్డు పక్కనే ఉన్న రెయిన్ వాటర్ డ్రైనేజీలో పడింది. ఒక్కసారిగా బస్సు అదుపుతప్పడంతో బస్సు వెనుక కూర్చున్న గుంటూరు రూరల్ మండలం నల్లపాడు గ్రామానికి చెందిన కరణం శేషసాయి కుమార్(28) అక్కడికక్కడే మరణించాడు. మరో నలుగురికి గాయాలు అయ్యాయి. వీరిని వెంటనే గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అదుపు తప్పి కాలువలో కూరుకుపోయిన మినీ బస్సు

రాష్ట్ర పోలీసు చెక్‌పోస్టు తనిఖీ

దాచేపల్లి, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పల్నాడు జిల్లాలోకి ఎటువంటి అక్రమ మద్యం, పరిమితికి మించిన నగదు సరఫరా కాకుండా నిరంతరం అప్రమత్తంగా వుండాలని నూతనంగా పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బిందుమాధవ్ అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల అంతరాష్ట్ర పోలీసు చెక్‌పోస్టును ఎస్పీ బిందు మాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ సమయంలో ఏమైనా వాహనాలు, వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే మీ పై అధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ బాల నాగిరెడ్డి, ఎస్ఐ శివ నాగరాజు, తదితరులున్నారు.


పొందుగల రాష్ట్ర పోలీసు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్

ప్రభావశీల నేత బాబు జగ్జీవన్‌రామ్

- జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో డాక్టర్ పెమ్మసాని


జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెమ్మసాని

గుంటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అణగారినవర్గాల పట్ల వున్న వ్యత్యాసాలు, అడ్డంకులను లెక్కచేయకుండా తన గళాన్ని బలంగా వినిపించిన నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్ అని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా గుంటూరులోని పట్టాభిపురం, మార్కెట్ సెంటర్లలోని ఆయన విగ్రహాలకు పెమ్మసాని, గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు అభ్యర్థులు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అత్యంత ప్రభావంతమైన నాయకుల్లో జగజ్జీవన్ రామ్ ఒకరని, ఆయన నాయకత్వ పటిమను స్ఫూర్తిగా తీసుకొని నాయకులు ఎదగాలని తెలిపారు. రామాంజనేయులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. గళ్లా మాధవి మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం బాబు జగ్జీవన్‌రామ్ చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. మద్దిరాల మ్యానీ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ చేసిన పోరాటాన్ని ఈ వైసీపీ ప్రభుత్వం ఒకసారి గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్


వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్

అమృతలూరు, ఏప్రిల్ 5: రాజకీయపార్టీల ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చినప్పటికి వాటి అమలులో వలంటీర్లు నిర్లక్ష్యం చూపుతున్నారు. అమృతలూరు 6వ వార్డులో వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మీ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఆమె వెంట ఇదే వార్డుకు చెందిన వలంటీర్ నూతక్కి పద్మశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిపై అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై వేటు

సత్తెనపల్లి, ఏప్రిల్ 5: ఎన్నికల కోడ్ ఉల్లంఘన నేపథ్యంలో సత్తెనపల్లి మండలం పాకాలపాడుకు చెందిన వలంటీర్లు బి.స్వాతి, ఈపూరి కృష్ణారెడ్డిలను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో జగదీష్ తెలిపారు. కట్టావారిపాలెంలో ఉపాధి హామి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతిరావును సస్పెండ్ చేసినట్టు ఏపీవో వెంకటనారాయణ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తూ వైసీపీ ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొనటంతో చర్యలు తీసుకున్నట్టు వారు తెలిపారు.

ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీ నేతకు చెంపదెబ్బ

కర్లపాలెం, ఏప్రిల్ 5: ప్రచారంలో ఉండగా వైసీపీ నేతను ఓ మహిళ చెంపదెబ్బ కొట్టిన ఘటన గురువారం రాత్రి యాదవపాలెంలో జరిగింది. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని చింతాయపాలెం పంచాయతీ యాదవపాలెంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే కోన రఘుపతి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. పక్కనే ఉన్న మండల ఉపాధ్యక్షుడు పందరబోయన సుబ్బారావును ఎలికా నాగలక్ష్మి చెంపదెబ్బ కొట్టింది. దీంతో ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ నేతలు అవాక్కయ్యారు. సుబ్బారావు స్థలం విషయంలో తమకు అన్యాయం చేశాడని, తనపై అక్రమసంబంధం ఆరోపణలు చేశాడని ఆమె ఆరోపించింది. ఆ మహిళపై సుబ్బారావు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేశామని ఎస్ఐ జనార్ధన్‌తెలిపారు.

మైనారిటీల అభ్యున్నతికి టీడీపీ కృషి

- డాక్టర్ చదలవాడ అరవిందబాబు


ఇఫ్తార్‌లో పాల్గొన్న లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధి, సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. పట్టణంలోని రావిపాడు రోడ్డులో ఎన్నికల కార్యాలయం ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నరసరావుపేట పట్టణంతో పాటు జిల్లా నలుమూలల నుంచి ముస్లింలు పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేల్పుల సింహాద్రి యాదవ్, జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, రావెల జ్ఞాని, గొట్టిపాటి చౌదరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

18 నెలల పసిపాప మృతి

- భర్తపై ఫిర్యాదు చేసిన భార్య


పాప తల్లి శ్రావణి

కారంపూడి, ఏప్రిల్ 5: మండలంలోని పేటసన్నిగండ్లలో గత నెల 31వ తేదీ రాత్రి 18 నెలల పసిపాప మృతిచెందింది. అయితే భర్తపై అనుమానం వ్యక్తం చేస్తూ భార్య పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో శుక్రవారం వైద్యులు ఆ చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పేటసన్నిగండ్లకు చెందిన మన్నెం మహేష్‌కు ఈపూరు మండలం బొమ్మరాజుపల్లెకు చెందిన శ్రావణితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 18 నెలల పాప అక్షయ సంతానం. కాగా గత నెల 31వ తేదీన అక్షయ ముక్కు నుంచి రక్తం కారుతూ విగతజీవిగా మారింది. గమనించిన తల్లిదండ్రులు ఆ పాపను కారంపూడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మరుసటి రోజు ఈనెల 1వ తేదీన పాపను ఖననం చేశారు. అయితే తన కుమార్తె మరణం పట్ల తన భర్తపై అనుమానం ఉందని శ్రావణి కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శుక్రవారం గుంటూరు మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు గ్రామానికి చేరుకొని ఖననం చేసిన అక్షయ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. మృతికి గల కారణాలు కొద్ది రోజుల్లో తెలుస్తాయని సీఐ చిన మల్లయ్య తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,172
చికెన్ విత్ స్కిన్	292.00
చికెన్ స్కిన్ లెస్	302.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు చంద్రబాబు ప్రజాగళం రోడ్‌షో

సత్తెనపల్లి, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తరువాత పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లిలో తొలిసారిగా ఎన్నికల శంఖారావం పూరించటానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శనివారం ప్రజాగళం రోడ్ షోలో పాల్గొనున్నారు. రోడ్‌షోకు ప్రజలను తరలించేందుకు టీడీపీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ నాయకత్వంలో కూటమి నేతలు కృషి చేస్తున్నారు. ఇప్పటికే మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీ శ్రేణులకు దిశ, నిర్దేశంచేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరులో జరిగే బహిరంగసభ అనంతరం సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ వద్ద చంద్రబాబు నియోజకవర్గంలోకి ప్రవేశించనున్నారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు కన్నా ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. సాయంత్రం 6 గంటల నుంచి రోడ్ షో ప్రారంభం కానుంది. అనంతరం వెంకటేశ్వర కల్యాణ మండపంలో చంద్రబాబు బస చేయనున్నారు. రోడ్‌షో, బస ఇతర ఏర్పాట్లను కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కూటమి నేతలు పర్యవేక్షించారు. ఆదివారం మధ్యాహ్నానికి చంద్రబాబు పర్యటన ముగించుకొని హెలికాప్టర్‌లో కృష్ణా జిల్లా పామర్రు వెళ్ళనున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రోడ్ షోలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సత్తెనపల్లి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు.

చంద్రబాబు రోడ్‌షోకు తరలిరండి..

నారా చంద్రబాబునాయుడు రోడ్‌షో శనివారం సాయంత్రం సత్తెనపల్లిలో ప్రారంభంకానున్న నేపథ్యంలో మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని తెలుగు మహిళా నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శారదాదేవి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బండారపల్లి సంధ్య, పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మి తులసీలు పలు ప్రాంతాల్లో పర్యటించి బొట్టు పెట్టి రోడ్‌షోకు హాజరుకావాలని మహిళలను ఆహ్వానించారు.

దళిత నేతలను పాలేర్లుగా మార్చిన జగన్

● మాల మహనాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్



మాట్లాడుతున్న గోళ్ళ అరుణ్ కుమార్

సత్తెనపల్లి, ఏప్రిల్ 5 : సీఎం వైఎస్ జగన్ పాలనలో దళిత ఎమ్మెల్యేలు, మంత్రులను సజ్జల ఇంట్లో పాలేరులుగా మార్చారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా అవమానించిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, హత్యాకాండలు పెరిగాయన్నారు. 27 సంక్షేమ కార్యక్రమా లను ప్రభుత్వం రద్దు చేసి దళితులను మోసం చేసిందన్నారు. తెలంగాణాలో టీఆర్ఎస్‌కే పట్టిన గతి రాష్ట్రంలో వైసీపీకి పడుతుందన్నారు. రానున్నరోజుల్లో పెదిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి జైలుకు వెళ్ళటం ఖాయమ న్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న దళిత వ్యతిరేక విధానాలను గ్రామాగ్రామాన మాలపల్లెల్లో వివరించి చైతన్య వంతులను చేస్తామన్నారు. త్వరలో రాష్ట్ర రాజధానిలో మాలల ఆత్మగౌరవసభ నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా మాలలంతా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాల మహానాడు నేతలు గుంటూరు ఆశీర్వాదం, రాజశేఖర్, పురంచిన ఆదం పాల్గొన్నారు.



నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ధర్నాచేస్తున్న మహిళలు

తాగునీరు ఇప్పించండి..

● నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

దాచేపల్లి, ఏప్రిల్ 5: మండు వేసవిలో తమకు తాగునీటిని అందించాలని కోరుతూ దాచేపల్లి నగర పంచాయతీలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం నారాయణపురంలోని టీడీపీ కార్యాలయం నుంచి 2 కిలోమీటర్ల దూరం ఖాళీ బిందెలతో ప్రయాణం చేస్తూ నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకొని కమిషనర్ వద్ద మహిళలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గత కొద్దిరోజులుగా తాగునీరు లభించక నానా అవస్థలు పడుతుంటే అధికార పార్టీనేతలు ట్యాంకర్లు తమకు నచ్చిన వారికి తాగునీటిని అందిస్తూ విపక్షాలకు చెందిన వారి ఇళ్ల వద్ద తాగునీరు అందకుండా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇదే పరిస్థితి కొనసాగితే మూకుమ్మడిగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన కమిషనర్ నారాయణరావు మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు ట్యాంకర్ల వద్ద వుంటే వెంటనే మాకు తెలియజేయండి.. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, కర్నాటి వరలక్ష్మి, నర్రా పుల్లయ్య, వేముల తిరుమలకుమార్, రుద్రాల అచ్చారావు, కొప్పుల గిరి, మునగా నిమ్మయ్య, అక్కినపల్లి బాలయ్య, అంబటి శేషగిరిరావు, షేక్ పెదలాల, సొసైటీ నారాయణ, బొమ్మిరెడ్డి నారాయణ, తదితరులున్నారు.

వ్యాపారులపై తప్పుడు కేసులు దుర్మార్గం

● జగన్ హామీకి ఐదేళ్లైనా అతీగతీ లేదు

● వ్యాపారుల సమావేశంలో కూటమి అభ్యర్థి యరపతినేని



సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 5: పిడుగురాళ్ల సమీప ప్రాంతాలలో గతంలో చిన్న చితక వ్యాపారులు, మరెందరో పొందుతున్న జీవనోపాధికి కొందరు వైసీపీ నేతలు దురాలోచనతో అక్రమ కేసులుపెట్టి వేధించారని గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక వల్లెలగార్డెన్స్‌లో పిడుగురాళ్ల చిప్స్, పల్వరైజర్స్, రేమాండ్ మిల్లుల అసోసియేషన్ నేతలు ఏర్పాటు చేసిన సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ.. ప్రతి వ్యాపారంలోనూ తమ ఆధిపత్యం కొనసాగాలని, ప్రతి వ్యాపారిని తమ దారికి తెచ్చుకో వాలన్న దుర్మార్గ ఆలోచనతో వైసీపీ నేతలు అనేకమంది వ్యాపారులపై అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందుల పాల్జేశారని అన్నారు. 2019 ఎన్నికల ముందు పిడుగురాళ్ల పర్యటనకు వచ్చిన జగన్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల లోపే సున్నం వ్యాపారులపై పెట్టిన కేసులన్నీ తొలగిస్తానని చెప్పిన హామీకి ఇంతవరకు అతీగతీ లేదన్నారు. ఈ సందర్భంగా పలువురు మిల్లుల యజమానులు, వ్యాపారులు పలు సమస్యలను యరపతినేని దృష్టికి తీసుకువచ్చారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి తప్ప వైసీపీ చేసిందేమీ లేదు

టీడీపీ హయాంలో పట్టణంలోని చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్ అభివృద్ధి టీడీపీ హాయంలోదేనని, అనంతరం వైసీపీ చేసిందేమీ లేదని యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. 'వాకింక్ విత్ యరపతినేని' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటలకు వాకింగ్ చేస్తూ పట్టణంలోని పలువురు సీనియర్ సిటిజన్స్‌తో యరపతినేని మాట్లాడారు. గతంలో వాకింగ్ చేసేందుకు ఎంతో అనువుగావున్న చెరువుకట్ట ఇప్పుడు గతుకులమయంగా మారి నడిచేందుకు ఇబ్బందిగా వుందన్నారు. ఈ సందర్భంగా పలువురు వాకర్స్ పలు సమస్యలను యరపతినేని దృష్టికి తీసుకొచ్చారు. యరపతినేని మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక వాకింగ్ ట్రాక్ చుట్టూ పెన్సింగ్, చెట్ల పెంపకం, లైటింగ్, క్యాంటీన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయిస్తానని భరోసా ఇచ్చారు.

100 కుటుంబాలకు పైగా వైసీపీని వీడి టీడీపీలో చేరిక

పిడుగురాళ్ల, మాచవరం మండలాలకు చెందిన వందలాది కుటుంబాలు శుక్రవారం యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాచవరం మండలం నాగేశ్వరపురంతండాకు చెందిన ఎస్టీ సుగాలీ సామాజికవర్గం టీడీపీ కండువా కప్పుకున్నారు. అలాగే జానపాడు గ్రామంలోని పలు సామాజికవర్గాలకు చెందిన 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు.

జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి.. టీడీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి యరపతినేని శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

దాచేపల్లి : మండలంలోని నారాయణపురం టీడీపీ కార్యాలయంలో యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో నడికూడి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ కోగంటి శివన్నారాయణ, శ్రీరాములు, యానాల నాగేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ పల్లపు నాగేశ్వరరావుతో పాటు వడియరాజులు టీడీపీ కండువా కప్పుకున్నారు.



వాకింగ్ చేస్తున్న వారితో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు



యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరిన నాగేశ్వరపురంతండా వాసులు

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్

● మాచర్ల కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

● నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

మాచర్లటౌన్, ఏప్రిల్ 5: చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చెంచుకాలనీ, బెల్లంకొండవారిపాలెం, నాగులవరం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు పెట్టాలంటే టీడీపీకి ఓటు వేయాలన్నారు. జగన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందులు పడ్డాయన్నారు. తనను గెలిపిస్తే మాచర్లలో వైసీపీ నాయకుల గుండాయిజాన్ని అణచివేస్తానన్నారు. బెల్లంకొండవారిపాలెంలో మహిళలు అధిక సంఖ్యలో బ్రహ్మారెడ్డి ప్రచారరథానికి హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, మాజీ ఉప ఎంపీపీ గన్నెబోయిన వెంకటేశ్వర్లు, చిరుమామిళ్ల చలమయ్య, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, కొల్లూరి వెంకట్రామయ్య, కర్నాటి రామయ్య, బెల్లంకొండ సైదారావు, ఒట్టికొండ హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమస్యలను పరిష్కరిస్తా..

దుర్గి : పాత్రికేయులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, కూటమి అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఏపీయూడబ్ల్యూజే మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో పాత్రికేయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అక్రిడియేషన్ తొలగించి రాయితీలను నిలిపివేసిన దుర్మార్గపు ప్రభుత్వం వైసీపీ అన్నారు. టీడీపీ హయాంలో వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడియేషన్‌తో పాటు ఉచిత బస్సు ప్రయాణం, హెల్త్ కార్డులు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మీడియా ప్రతినిధులకు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. అనంతరం బాబు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ప్రచారంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

మాచర్ల రూరల్/రెంటచింతల : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డికి దానం చేయడమే గానీ దోచుకోవడం తెలీదని బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 22, 23 వార్డుల్లోనూ, రెంటచింతలలోని వేంకటేశ్వరస్వామి మాణ్యం, ఆరోగ్యపురంలో ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను ప్రజలకు వివరించారు. బ్రహ్మారెడ్డి నిత్యం నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి ఆకాంక్షించే వ్యక్తి అన్నారు. రానున్న ఎన్నికల్లో బ్రహ్మారెడ్డికి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వెల్దుర్తి : ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచి ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే పంపిణీ జరుగుతుందని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి తనయుడు గౌతమ్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి అన్నారు. మండలంలోని శ్రీరాంపురతండా, రచ్చమలపాడు గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలకు మద్దతు తెలిపి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.



ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

టీడీపీలో భారీగా చేరికలు

● టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఏప్రిల్ 5: బెల్లంకొండ మండలంలో చండ్రాజుపాలెం గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ వారిని సాదరంగా ఆహ్వానించి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రాబోయేది టీడీపీ ప్రభుత్వమని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తే ఆంధ్ర రాష్ట్రం సంక్షేమంతో పాటు అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారని తెలిపారు. ఒక్కసారి ఆదరిస్తే పెదకూరపాడు నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధితో మీకు సేవకుడిగా ఉంటానని ఆయన తెలిపారు. అనంతరం పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వెన్నా సాంబశివరెడ్డి, పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, లక్ష్మీనారాయణ, ఓర్సు ఆనంద్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, ముళ్ళా బిక్షం, ఓర్సు రాంబాబు, శ్రీనివాసరావు, సయ్యద్ జానీ, సయ్యద్ జబ్బార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాగళం సభను విజయవంతం చేయాలి

పెదకూరపాడు, ఏప్రిల్ 5 : ఈనెల 6వ తేదీ శనివారం క్రోసూరులో జరిగే ప్రజాగళం సభను విజయవంతం చేయాలని నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు క్రోసూరులో జరిగే సభకు నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వేలాది సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. పెదకూరపాడు నుంచి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ జరుగుతుందని, ఆ ర్యాలీలో యువత పాల్గొనాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

సత్తెనపల్లి, ఏప్రిల్ 5 : పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నేతలు మద్ది వెంకటేశ్వర్లు, మధుసూదన్, చిల్లంచర్ల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించిన కన్నా లక్ష్మీనారాయణ,

సత్తెనపల్లి, ఏప్రిల్ 5 : భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 117 జయంతిని శుక్రవారం స్థానిక టీడీపీ ప్రజావేదికలో కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కన్నాతో పాటు పలువురు టీడీపీ నేతలు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరావతి బస్టాండ్ సెంటర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కాంగ్రెస్, వైసీపీ, బీసీ సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **అమరావతి :** మండల కేంద్రమైన అమరావతితో పాటు మునగోడు, వైకుంటపురం, అత్తలూరు, ఉంగుటూరు గ్రామాల్లో జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. వివిధ పార్టీల, సంఘాల నేతలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

బెల్లంకొండ : మండలంలోని న్యూ చిట్యాల ఆర్‌అండ్‌ఆర్ టీడీపీ కార్యాలయంలో బెల్లకొండ టీడీపీ ఇన్‌చార్జి ఘంటా రమణ, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్‌లు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నేతలు పలువురు పాల్గొన్నారు.

క్రోసూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి టీడీపీ నేతలు కాండ్రు కాశయ్య, నలజాల సదాశివరావు, నలజాల కోటేశ్వరరావు, మన్నెం శ్రీనివాస రావు, వెంకట రామిరెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నంబూరుశంకరరావు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నేతలు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్ : మాచర్ల పట్టణంలో టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మూఢావత్ వజ్రం నాయక్, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, యెనుముల కేశవరెడ్డి, పేరువాళ్ల పుల్లయ్య, మాచర్ల వాసు, మండాది కోటయ్య తదితరులు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండల రెవెన్యూ కార్యాలయంలోనూ జగజ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.

విజయపురిసౌత్: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్కు, బుర్రకథ కళాకారుడు వంకాయలపాటి రాందాసులు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దాచేపల్లి: టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ భద్రి అధ్యక్షతన జగజ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. టీడీపీ నేతలు పలువురు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రెంటచింతల : భారత మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్‌రామ్ 57 సంవత్సరాల పాటు చట్టసభల్లో ఉండి అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ వేంకటరమణ అన్నారు. జగజ్జీవన్ రామ్ 116 జయంతిని టీడీపీ, కన్నెగంటి హనుమంతు సేవా సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు.

కారంపూడి : మండల కేంద్రమైన కారంపూడిలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల మధుబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పెదకూరపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌వోలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.



జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

కూటమి గెలుపు ఖాయం

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, ఏప్రిల్ 5 : గోదావరి - పెన్నా నదుల అనుసంధానం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటం, ఆంధ్ర ప్రదేశ్ రాజధానిని నిర్మించటం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి నకరికల్లు టీడీపీ కార్యాలయంలో నకరికల్లుకు చెందిన ఎస్సీ ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వైసీపీలోని 225 కుటుంబాలు టీడీపీలో చేరారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ప్రజలంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించటానికి సంసిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, పార్టీ పరిశీలకులు ముక్కపాటి రామచంద్రరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు బత్తిన శ్రీనివాసరావు, బీజేపీ నేతలు షేక్ మున్వర్ బాజీ, పాలడుగు శ్రీనివాసరావు, తిరుమలశెట్టి వెంకటరావు, ఢీకొండ మహానంది, సాంబయ్య, భవనాసి కిషోర్, దూదేకుల హుస్సేన్‌బీ, అట్లూరి పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌కు ఘన నివాళి..

నకరికల్లు టీడీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా న్యాయవాది జీ కన్నారావు తదితరులు పాల్గొని జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కైపు రవి, దూదేకుల హుస్సేన్ బీ, చింతపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

పది మూల్యాంకన కేంద్రంలో కలెక్టర్ తనిఖీ


సెయింట్ ఆన్స్ మూల్యాంకన కేంద్రంలో సమాధాన పత్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట కల్చరల్, ఏప్రిల్ 5: పట్టణంలోని ప్రకాష్‌నగర్ సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పది పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను మూల్యాంకనం చేస్తున్న విధానాన్ని గురించి అడిగారు. ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తున్న ప్రశ్నాపత్రాలను కొన్నింటిని పరిశీలించారు. అనంతరం కేంద్రంలో ఉన్న వసతుల గురించి ఆరాతీశారు. తనిఖీలో కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, ఉపవిద్యాశాఖాధికారి కె. వేణుగోపాల్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ


కలెక్టర్ శివ శంకర్‌కు పూల మొక్కను అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 5: పల్నాడు జిల్లా ఎస్పీగా గురువారం బాధ్యతలు స్వీకరించిన గరికపాటి బిందు మాధవ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలిశారు. ఆయనకు పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా నిర్వహించటానికి సంయుక్తంగా కృషి చేస్తామన్నారు. బిందు మాధవ్‌కు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

నాలుగు వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 5: నకరికల్లు మండలం చేజర్లలో కాపు సారాకు ఉపయోగిస్తున్న నాలుగు వందల లీటర్ల బెల్లం ఊటను చేజర్లలో ధ్వంసం చేసినట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తుండగా చేజర్ల పొలాల్లో ఈ స్థావరం బయటపడినట్టు ఆమె తెలిపారు.

పీహెచ్‌సీలో వసతులపై వైద్య బృందం పరిశీలన


రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

రొంపిచర్ల, ఏప్రిల్ 5: మండలంలోని రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండెడ్ కమిటీ నుంచి ఇద్దరు వైద్యుల బృందం శుక్రవారం తనిఖీచేశారు. డాక్టర్ వాసంతి, డాక్టర్ అనోజ్‌లు ఆస్పత్రిలోని వివిధ రకాల పరికరాలను, మందులను పరిశీలించారు. ప్రజలకు సంబంధించి వచ్చే వ్యాధులు, వాటి నివారణ కోసం ఇస్తున్న మందుల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందించే సేవల గురించి ఆశా వర్కర్లను అడిగారు. ఆస్పత్రిలోని వసతులపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఇటీవల వైద్యశాలకు పలు రకాల మందులు, రోగులకు ఉపయోగించే బెడ్లువచ్చాయి. కార్యక్రమంలో వైద్యులు జగన్ నరసింహారెడ్డి, సాయిబాబు, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా కో-ఆర్డినేటర్ రామ్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రొంపిచర్ల, ఏప్రిల్ 5: మండలంలోని రొంపిచర్ల సమీపంలో అద్దంకి - నార్కెట్‌పల్లి హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. మృతిచెందిన వ్యక్తి వివరాలు తెలియరాలేదని ఎస్ఐ పాల్‌రాజు రవీంద్ర తెలిపారు. ఎవరైనా సమాచారం తెలిస్తే ఫోన్ నెంబరు 9440796247కు తెలియ జేయాలన్నారు.

రొంపిచర్ల, నరసరావుపేట రహదారిలో తనిఖీలు

రొంపిచర్ల, ఏప్రిల్ 5: మండలంలోని రొంపిచర్ల నుంచి నరసరావుపేట వెళ్ళే రహదారిలో ఫ్లయింగ్ స్క్వాడ్ శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.1.50 లక్షలు నగదును గుర్తించారు. బ్యాంక్ నుంచి వస్తున్నామని సదరు వ్యక్తులు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన లావాదేవీలను చూపించటంతో నగదును ఇచ్చారు.

రెడ్డిపాలెంలో సర్పంచ్ భర్తపై దాడి: పరస్పర ఫిర్యాదులు

రొంపిచర్ల, ఏప్రిల్ 5: మండలంలోని రెడ్డిపాలెం సర్పంచ్ బత్తుల అంజమ్మ భర్త అంజయ్య, ఉన్నం శ్రీనివాసరావులకు మధ్య శుక్రవారం ఘర్షణ తలెత్తింది. శ్రీనివాసరావుకు చెందిన స్థలంలో ఇటీవల కరెంటు స్తంభం వేయటంతో వివాదానికి కారణమైంది. ఇరువురు ఘర్షణ పడటంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్ఐ పాల్‌రాజు రవీంద్ర మాట్లాడుతూ ఇద్దరి ఫిర్యాదు తీసుకున్నామని, విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కార్యాలయం ప్రారంభం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 5: స్థానిక లాయర్స్ స్ట్రీట్‌లో నేషనల్ హ్యూమన్‌రైట్స్ కార్యాలయాన్ని రావులపల్లి విశ్వనాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ఆర్గనైజింగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి పాలడుగు రామాంజి, ట్రెజరర్ రామాంజనేయులు, బట్టు శ్రీనివాసరావు, తోట నాగాంజనేయులు, పల్నాడు జిల్లా ఉమెన్ ప్రొడక్షన్ అధ్యక్షురాలు రావులపల్లి అనిత, శ్రీనివాసరావు, అమరేందర్, రమేష్, రాజు, వెంకటరమణ, రహంతుల్లా, ప్రభుదాస్, సత్యనారాయణ, మేడం రమేష్, బత్తుల రమేష్, సిద్ధయ్య, బలరాం, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదం

నూజెండ్ల, ఏప్రిల్ 5: స్థానిక సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం సాయంత్రం విద్యుత్ స్పార్క్‌తో రవ్వలుపడి మోడల్ పాఠశాల, విద్యుత్ సబ్ స్టేషన్ పరిసరాల్లోని గడ్డికి నిప్పు అంటుకొని ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న వినుకొండ అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. గతంలో కూడా మోడల్ పాఠశాల పరిసరాలను శుభ్రపరచటం వంటి చర్యలను చేపట్టక పోవటంతో అగ్ని ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి.

నగదు, మద్యం రవాణా చేస్తే కఠినచర్యలు: సీఐ

శావల్యాపురం, ఏప్రిల్ 5: ఎన్నికల నిబంధనలను అతిక్రమించి ఎటువంటి ఆధారాలు లేకుండా నగదు, మద్యం రవాణాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు హెచ్చరించారు. గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై మండలంలోని పోట్లూరు సమీపంలోని రైల్వే అండర్ పాస్ వద్ద ఎస్ఐ చల్లా సురేష్‌తో కలసి శుక్రవారం ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలను ఆపి నగదు, మద్యం నిల్వలను తనిఖీచేశారు. రూరల్‌సీఐ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ప్రజలంతా తప్పకుండా పాటించాలని, నగదు, మద్యం రవాణా చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల వేళ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కేంద్ర బలగాలతో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

కూరగాయల మార్కెట్ నూతన అధ్యక్షుడిగా సుంకరి

వినుకొండ టౌన్, ఏప్రిల్ 5: వినుకొండ నియోజకవర్గం కూరగాయల మార్కెట్ అధ్యక్షుడిగా సుంకరి శ్రీనివాసరావును వ్యాపారులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్, మున్సిపల్ కౌన్సిలర్ తుమ్మలగూడ నన్నేసా, కార్యదర్శిగా ఉప్పు కృష్ణ, జాయింట్ సెక్రటరీగా దేవిశెట్టి తిరుపతిరావు, వట్రం సీతారామయ్యలను ఎన్నుకున్నారు. నూతన సభ్యులుగా ఎన్నుకున్న సందర్భంగా మార్కెట్‌లోని వర్తక యజమానులతోపాటు ముఠా సభ్యులు పాల్గొని సుంకరి శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు సుంకరి నాగేశ్వరరావు, కఠారు వెంకటనారాయణ, సుంకరి యల్లయ్య, అడపాల రాములు, షేక్ అహమ్మద్ వలి, సింగంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేయకుండానే కులధ్రువీకరణ పత్రాలు

శావల్యాపురం, ఏప్రిల్ 5: ప్రజలు దరఖాస్తు చేయకుండానే కులధ్రువీకరణ పత్రాలను అందజేసేందుకు అధికారులు యత్నిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. మండలంలోని 11 సచివాలయాలలో వీఆర్వోల లాగిన్‌లకు గురువారం సాయంత్రం ప్రభుత్వం సుమారు 800మంది కులధ్రువీకరణలకు సంబంధించిన వివరాలు సేకరించాలని జాబితాలు విడుదల చేసింది. వీఆర్వోలు కులధ్రువీకరణకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. దీనిపై డిప్యూటీ తహసీల్దార్‌ను వివరణ కోరగా తనకు ఎటువంటి సమాచారం లేదన్నారు. ఆర్ఐని వివరణ కోరగా వీఆర్వోలు వివరాలు ఆన్‌లైన్ చేశాక ఉన్నతాధికారులు శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు.

కరువు పీడిత రైతులను జగన్ పరామర్శించాలి

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 5: మేమంతా సిద్ధం అంటూ రాష్ట్రమంతా ఎన్నికల ప్రచారం చేస్తున్న జగన్ ఆదేపనిలో భాగంగా కరువు పీడిత రైతులను పరామర్శించి కన్నీళ్లు తుడవాలని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. చిలకలూరిపేట మండలం మద్దిరాల, పోతవరం గ్రామాల్లో ఎన్నికల శంఖారావం పథకాలపై శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో ప్రజల, రైతుల సాదకబాధకాలు తెలుసుకొని ప్రభుత్వ ఎంత ఎన్నికల హడావుడిలో ఉన్నా కరువు ఉపశమన చర్యలపై కాస్తయినా దృష్టి పెట్టాలన్నారు. వంద సంవత్సరాల్లో ఎప్పుడూ లేనంత వర్షాభావం, కరువు పరిస్థితులు నెలకుంటే బాధిత ప్రాంతాల రైతులను, ప్రజలను కనీసం పట్టించుకొనే పరిస్థితుల్లో ముఖ్యమంత్రి జగన్‌గాని, అధికారపక్షం గాని లేకపోవటం చాలా దారుణమన్నారు. అనంతరం మద్దిరాల గ్రామంలోని మసీదులో దువా నిర్వహించారు.

పలువురు టీడీపీలో చేరిక

పట్టణంలోని పలు వార్డుల నుంచి మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. అన్నదాసుల బుల్లి, ఎంవీ రత్నారెడ్డిల ఆధ్వర్యంలో మూడు వందల కుటుంబాలు, ఆటో యూనియన్ సభ్యులు 9వ వార్డుకు చెందిన అన్నలదాసు ఫ్రాన్సిస్, షేక్ బడేమియా, నాగరాజుల ఆధ్వర్యంలో 15కుటుంబాలు, 18, 25 వార్డులకు చెందిన గజేంద్ర ఏడుకొండలు ఆధ్వర్యంలో 20కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

పలు గ్రామాల్లో టీడీపీ నాయకుల ప్రచారం

నాదెండ్ల, ఏప్రిల్ 5: మండలంలో పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అమలు జరపనున్న సూపర్-6 పథకాలపై ప్రచారాలు నిర్వహించారు. సాతులూరు, గొరిజవోలు, కనపర్రు తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి పథకాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలను అమలు చేస్తామని వివరించారు.

అబద్ధాల సీఎం జగన్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలి

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ


21 వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న తెలుగు దేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 5: మేమంతా సిద్ధమంటూ మరోసారి అబద్ధాల యుద్ధానికి బయలుదేరిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలని పల్నాడు జిల్లా తెలుదేశం పార్టీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని 21 వార్డులో జీవీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్దఎత్తున పాల్గొని ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ సాక్షాత్తు ముఖ్యమంత్రికే జనం నుంచి తిరస్కారం ఎదురవుతుంటే గల్లీలో తిరిగే బొల్లా బ్రహ్మనాయుడు పరిస్థితి తలుచుకుంటేనే వైసీపీపై జాలేస్తుందన్నారు. అధికారం అనుభవించిన ఐదేళ్లు ప్రజలకు దూరంగా, ప్రజల కష్టాలు పట్టించుకోకుండా విర్రవీగిన పాపానికి ఇప్పుడు వారంతా మూల్యం చెల్లించాల్సి వస్తోందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఎలా నష్టపోయిందో వివరించారు. తెలుగు దేశం మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను గురించి కరపత్రాలను అందచేసి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినుకొండ ప్రజలకు ఇప్పుడు ఏమికావాలో తనకు, ఎంపీగా పోటీచేస్తున్న శ్రీకృష్ణదేవరాయులకు పూర్తి అవగాహన ఉందని అన్నారు. ముఖ్యంగా వినుకొండ పట్టణంలోని సమస్యలను పరిష్కరించడంలో బొల్లా బ్రహ్మనాయుడు విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పుడైనా మౌలిక వసతులు కల్పించలేని ప్రభుత్వం కావాలో, అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే తెలుగుదేశం ప్రభుత్వం కావాలో ఓటు ద్వారా పట్టణ ప్రజలు తీర్పు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ, తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవీని గెలిపించండి: హరీష్‌బాబు

శావల్యాపురం, ఏప్రిల్ 5: టీడీపీ ప్రభుత్వ హయాంలో వినుకొండ నియోజకవర్గానికి కోట్ల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధికి బాటలు వేసిన పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఉమ్మడి కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులుని అఖండ మెజారిటీతో గెలిపించాలని జీవీ తనయుడు గోనుగుంట్ల హరీష్‌బాబు కోరారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా మండలంలోని శానంపూడి, చిన్నకంచెర్ల గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. హరీష్‌బాబు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు కలగనుందని, మహిళలకు ఆర్థిక భరోసా, యువతకు ఉద్యోగావకాశాలు, రైతులకు పెట్టుబడి సాయం చేకూరనుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమిని గెలిపించాలన్నారు. టీడీపీ నాయకులు అమృతపూడి కోటయ్య, దావులూరి చిన్నపేరయ్య, వడ్లమూడి వెంకటకోటయ్య, మందలపు వెంకటనారాయణ, పూరేటి వెంకట్రావు, సీనియర్ నేతలు యరమాసు కోటేశ్వరరావు, గడిపూడి విశ్వనాధం, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు పాల్గొన్నారు.

పోట్లూరులో 25 కుటుంబాలు టీడీపీలోకి...

పోట్లూరు (శావల్యాపురం) ఏప్రిల్ 5: రాష్ట్రవ్యాప్తంగా దూసుకుపోతున్న సైకిల్ స్పీడుకు రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ అడ్రస్ గల్లంతు కానుందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని పోట్లూరులో వైసీపీకి చెందిన 25 కుటుంబాలు పార్టీని వీడి మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మానుకొండ శివప్రసాద్ సమక్షంలో శుక్రవారం టీడీపీలోకి చేరాయి. వినుకొండలోని జీవీ నివాసంలో నూతనంగా పార్టీలోకి చేరినవారికి నేతలు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పోట్లూరుకు చెందిన ఈపూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ గడిపూడి ప్రసాద్, విద్యాకమిటీ ఛైర్మన్ గడిపూడి వెంకటరమణ, ముఖ్యనేతలు మండవ సుబ్బారావు, కొమ్మినేని శ్రీరాములు, గడిపూడి అంజయ్య, రామయ్య, రామాంజనేయులు, శేఖర్, పాపారావు, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, నెల్లూరి నాగేశ్వరరావు, చింతా శివశంకర్ తదితరులు టీడీపీలో చేరారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, తెలుగు యువత గోనుగుంట్ల ధనుంజయ్, గడిపూడి విశ్వనాధం, వెంకటరాయుడు, పూర్ణచంద్రరావు, ఆంజనేయులు, గాలి వెంకటేశ్వర్లు, కామినేని శ్రీనివాసరావు, పొందూరి సుబ్బయ్య గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి

● కలెక్టర్ శివశంకర్ లోతేటి


కలెక్టర్ కార్యాలయంలో జగ్జీవన్‌రావ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 5: మాజీ ఉపరాష్ట్రపతి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్‌రామ్ ప్రత్యేకకృషి చేశారని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో జిల్లా యంత్రాంగం తరఫున నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఇన్చార్జి సాంఘిక సంక్షేమ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 5: స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్త, భారతదేశ మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని శుక్రవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. బిందు మాధవ్ మాట్లాడుతూ బలహీనవర్గాల వారి అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ గాంధీ, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బహుజనవర్గాల గొంతుక జగ్జీవన్‌రామ్: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 5: దళిత, బహుజన వర్గాల గొంతుకగా నిలిచిన బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శాలు నేటికి అనుసరణీయమని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబు మాదిగ నివాళి అర్పించారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ కోరుకున్న సామాజిక సమానత్వం రావాలంటే పాలకుల్లో పేదలపై ప్రేమ, బాధ్యత, భవిష్యత్


బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

పట్ల దార్శనికత ఉండాలన్నారు. ఇలాంటి లక్షణాలులేని జగన్‌రెడ్డి లాంటి వాళ్ళు ముఖ్యమంత్రిగా కాదు అసలు రాజకీయాలకే అనర్హులన్నారు.

● శావల్యాపురం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శావల్యాపురం సెంటర్లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మల్లాపరపు రాజశేఖర్, సీనియర్ నేత కందుకూరి శ్యాంబాబు, ఎంఆర్పీఎస్ నేతలు ముట్లూరి నాగరాజు, ముట్లూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో...

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 5: భారతదేశ మాజీ ఉపప్రధాని జగజ్జీవన్‌రావు జయంతి వేడుకలు శుక్రవారం నరసరావుపేట పట్టణ కార్యాలయాలలో ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట పట్టణ కార్యాలయంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా టీడీపీ కార్యాలయంలో టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల వెంకటేశ్వరరావు, జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జగ్జీవన్‌రామ్ జీవితచరిత్రను చదివించండి:జీవీ


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ , మక్కెన తదితరులు

వినుకొండ, ఏప్రిల్ 5: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైసీపీ నాయకులందరితో బాబు జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్రను ఒక్కసారైన చదివించాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక నర్సరావుపేట రోడ్డులో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయ సమీపంలోని విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ అధికారమదం తలకెక్కి దళిత బహుజనవర్గాల బాధలు కనీసం పట్టని వారికి బాబూజీ జీవిత చరిత్రతోనైనా కళ్లు తెరుచుకోవాలన్నారు. అనంతరం మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తికి విరుద్ధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అందుతున్న 100కు పైగా సంక్షేమ పథకాలను రద్దుచేసిన నిరంకుశ పాలకుడు జగన్ అని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఎం.శివప్రసాదరావు, జనసేన సమన్వయకర్త నాగశ్రీను రాయల్‌తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పల్లమీసాల దాసయ్య, జరపాల గోవిందనాయక్, మీసాల ప్రసాద్, ఆకుమల్ల కాశిం, ముంద్రు సుబ్బారావు, ఆళ్ళ మన్నయ్య, లక్ష్మీపురం కొండలు తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక సీపీఎం కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి బూదాల శ్రీనివాసరావు, బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, వెంకటేశ్వర్లు, పవన్, మస్తాన్, సుబేదార్, యూనుస్, శ్రీను, కోటేశ్వరరావు, వందనం, పి.వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు.

● మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని కేవీపీఎస్ నాయకులు, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నర్సరావుపేట రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, నవీన్, నాసర్‌వలి తదితరులు పాల్గొన్నారు.


నరసరావుపేట మండలం దొండపాడులో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి అరవిందబాబు

కూటమి ప్రభుత్వం తథ్యం

● ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగి మరో 45రోజులలో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుచేయడం జరుగుతుందని నరసరావుపేట టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నరసరావుపేట మండల పరిధిలోని దొండపాడు, పెదరెడ్డిపాలెం, ఇస్సపాలెం గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి నాయకులు, కార్యకర్తలు వద్దకు నేరుగా వెళ్లి కలిశారు. నరసరావుపేట గడ్డ మీద తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసే సమయం ఆసన్నమైందని ప్రతి ఒక్కరూ ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని, ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటున్నారని, అహంకారం ఉన్న వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాడు. జగన్ రెడ్డి అహంకారమే అతని రాజకీయ అంతానికి దారి తీస్తోందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తొలిగెలుపు నరసరావుపేట నుంచే: డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 5: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలి గెలుపు నరసరావుపేట నుంచే ప్రారంభం అవుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట జనసేన ఇన్‌చార్జ్ సయ్యద్ జిలానితో డాక్టర్ చదలవాడ అరవిందబాబు భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులపై ఇరువురు నాయకులు చర్చించుకున్నారు. అనంతరం సయ్యద్ జిలాని మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు సహాయ సహకారాలు అందిస్తామని అరవిందబాబు గెలుపునకు పని చేస్తామన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్డీయే కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో షబ్బీర్, ఆయుబ్, లాయర్ చెన్నుపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి: జీవీ ఆంజనేయులు

ఈపూరు, ఏప్రిల్ 5: కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, అందుకోసం దోపిడీదారులను ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ఊడిజర్ల, అగ్నిగుండాల పంచాయితీలలో శుక్రవారం రాత్రి ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రాపర్ల జగ్గారావు, తిరుమలశెట్టి బాలయ్య, గన్నమనేని వెంకయ్య, పాపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చాగంరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంగళరెడ్డి, నారాయణరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, ఏప్రిల్ 5: చిలకలూరిపేట టౌన్-2 పండరీపురం సబ్‌స్టేషన్ పరిధి నుంచి సింగునగర్, సాంబశివనగర్, కోర్టు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపి వేస్తున్నట్టుగా ఆయన పేర్కొన్నారు. కాగా 52 ఎకరాల పరిధిలోని టిడ్కో గృహ వినియోగదారులు తక్షణం విద్యుత్ బకాయిలను చెల్లించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో వారి విద్యుత్ మీటర్లను తొలగిస్తామని ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

చిలకలూరిపేట, ఏప్రిల్ 5: చిలకలూరిపేట మునిసిపాలిటీ పరిధిలోని ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలని శుక్రవారం సీపీఐ ఏరియా ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, ఏఐటీయూ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు శుక్రవారం డిమాండ్ చేశారు. మూడు నెలల నుంచి వీరికి జీతాలు చెల్లింపు నిలిపివేశారన్నారు. ఈ విషయంపై పలుమార్లు మునిసిపల్ కమిషనర్‌ను కలసి విన్నవించినప్పటికీ జీతాలు చెల్లించకపోవటం దారుణమన్నారు. గురువారం సాయంత్రానికే జీతాలు ఇస్తామని కమిషన్ ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. జీతాలు లేకపోవటంతో కార్మికులు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తీసుకొని వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్వాక్రా గ్రూపుల నుంచి పొందిన రుణాల కిస్తీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని పరిస్థితి చిలకలూరిపేట మునిసిపాలిటీలోనే ఉన్నదని వెల్లడించారు. కార్మికులు పనిముట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, కనీసం మరమ్మతులకు గురైన పుష్‌కాట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరినా ఫలితం లేదని తెలిపారు.

చిన్నారులకు టీడీపీ నాయకుడి ఆర్థికసాయం

యడ్లపాడు, ఏప్రిల్ 5: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామానికి చెందిన పల్లపు అంకమ్మ భార్య కోటేశ్వరి గత నెల 7న అనారోగ్యంతో మృతిచెందింది. భార్య మృతితో మనస్తాపానికి గురైన అంకమ్మ భార్య మృతిచెందిన 18రోజుల తరువాత మృతిచెందాడు. దీతో అంకమ్మ, కోటేశ్వరిల 13ఏళ్ళ కుమార్తె రూప, తొమ్మిదేళ్ళ కుమారుడు వీరబ్రహ్మేంద్రలు అనాధలుగా మిగిలారు. విషయం తెలుసుకున్న గుత్తావారిపాలె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పుటిగంపు వెంకటేశ్వరరావు శుక్రవారం యడ్లపాడులోని అంకమ్మ నివాసం వద్దకు చేరుకుని దంపతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించి రూ.10వేలు ఆర్థికసాయాన్ని చిన్నారుల చేతికి అందించారు. చిన్నతనంలోనే అనాథలైన చిన్నారులకు అందరూ అండగా నిలవాలని వెంకటేశ్వరరావు కోరారు.

టీడీపీ నేత పోతురాజుకు నేతల పరామర్శ

నాదెండ్ల, ఏప్రిల్ 5: మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మామిళ్ళపల్లి పోతురాజును పలువురు పరామర్శించారు. రెండు రోజుల క్రితం మోటారు బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడటంతో పోతురాజు గాయపడ్డాడు. నరసరావుపేటలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను నరసరావుపేట లావు శ్రీకృష్ణ దేవరాయలు, వికలాంగుల సంస్థ మాజీ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జీడీసీసీబీ మాజీ ఛైర్మన్ మానం వెంకటేశ్వర్లు, మండల టీడీపీ అధ్యక్షుడు సత్యనారాయణ, పలు గ్రామాల నాయకులు పరామర్శించారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

చిలకలూరిపేట, ఏప్రిల్ 5: పట్టణంలో పలుచోట్ల జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట కాంగ్రెస్ అభ్యర్థి ఎం.రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు గోవిందుశంకర శ్రీనివాస్, ఎం ప్రసన్న, బాజీ, షేక్ సలాం, అసీరుద్దీన్, మద్దుమాల ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. బ్యాంక్ కాలనీలో వైసీపీ ఎన్నికల కార్యాలయంలో వైసీపీ అభ్యర్థి కే మనోహర్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇక్కడే ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు వీణ విజయ రామరాజు 24వ వర్ధంతి కార్యక్రమాన్ని కూడా వారు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కే కోటేశ్వరరావు, పోటు శ్రీనివాసరావు, వినుకొండ అంకయ్య, మేకల కోటేశ్వరరావు, జయ ప్రకాష్, టీ కుమారి తదితరులు పాల్గొన్నారు. చిలకలూరిపేట తహసీల్దార్ కార్యాలయంలో జ్వాలా నరసింహం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పలు ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాలకు చెందిన శ్రీనునాయక్, కే నాగేశ్వరరావు, పోలూరి శ్యామ్ మోహనరావు, ఎం ఏసురాజు, కంచర్ల శ్రీనివాసరావు, సలికినీడి నాగరాజు, అడపా రవి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబు, విజయసాగర్, క్రాంతి మాదిగ, చిలక రత్నబాబు, ఏసయ్య, యలమంద, వలిబాబు జగ్జీవన్‌కు నివాళులర్పించారు.